# ఈ తరం ఆడపిల్ల కథ

-పి.జి.కె.మూర్తి

**"పిల్లా!"**

ఫోన్ రిసీవర్ క్రెడిల్ చేసి పిలిచాడు సూర్యం.

"ఏంటి నాన్నా!" చదువుతున్న న్యూస్‌పేపర్ని పట్టుకుని వీధి అరుగు మీద నుండి లోపలకు వచ్చింది కామ్య.

"అమ్మని ఓసారి పిలు."

కామ్య కదులుతుండగా, ఎదురు వచ్చిన వసంత "ఏమిటీ ఫోను?" అడిగింది భర్త వంక చూస్తూ ఆసక్తిగా.

"వాళ్ళు ఫోన్ చేశారు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి వస్తారట! మూడు గంటల పది నిముషాలకు పిల్లను చూస్తారట. అదీ విషయం" అన్న సూర్య కూతుర్ని చూశాడు.

కామ్య అరక్షణంలో అక్కడ నుండి మాయమైపోయింది.

వసంత చిన్నగా నవ్వుకుంది.

"పిల్లా!.. పిల్లా!" భార్య వంక చూసి, నవ్వుతూ పిలిచాడు సూర్యం.

"పిల్లా ఏంటి పిల్లా! ఇటువంటి సమయంలో కూడాను. కామ్య అని చక్కటి పేరుండగాను" సాగదీసింది నిష్ఠురంగా వసంత.

"ఓసి వెర్రిదానా! ఎన్నిసార్లు చెప్పాను. పిల్లల్ని పెద్దవాళ్ళు పేరు పెట్టి పిలవడం మంచిది కాదని" వివరణ యిచ్చాడు సూర్యం.

"ఆఁ! ఏమన్నా అంటే ఇదొకటి!" అన్న వసంత "అది సరేగాని ఇంతకీ, వాళ్ళు ఎంతమందట వచ్చేది?" తనవంతు మర్యాదలను దృష్టిలో వుంచుకుని అడిగింది.

"అదీ చెప్పారోయ్! కుర్రాడు- తల్లిదండ్రులు- ఆయన అన్నగారు, ఆయన కూతురున్నూ" అన్న సూర్యం "వాళ్ళెంత మంది వస్తే మనకెందుకు!?" అన్నాడు ప్రశ్నార్థకంగా భార్యను చూస్తూ.

"అందుకే అన్నారు, చూసైనా వుండాలి, చేసైనా వుండాలని, ఆ రెండూ లేవు మనకి." దెప్పిపొడుపుగా అన్న వసంత గడప నానుకుని కూర్చుంది.

"మా నాన్న- అమ్మ ఉంటే అన్నీ వాళ్ళు చూసుకునే వాళ్ళు. ఇప్పుడు మనకు మనమే పెద్దలం."

"అందుకేగా అక్క, బావా వెళ్ళిపోతామంటే, పెళ్ళి చూపుల కార్యక్రమం అయేవరకూ ఉండమన్నాను.

"సరే! నువ్వు వదిన గారితో సంప్రదించి వాళ్ళకు చేయవలసిన మర్యాదల సంగతి చూడు. నేనూ, అశ్వయ్యగారు చేయవలసినవి ఏమైనా వుంటే చెప్పుకుని చేసేస్తాం. సరేనా?" హుషారుగా అన్నాడు.

"సాయంత్రం మీరు వచ్చేప్పుడు రాజోలు సెంటరు నుండి స్వీట్సు, పూవులు- కాస్త ఖరీదైన జాకెట్ పీసులు పట్రండి- ఓ రెండు ఎక్కువగానే పట్రండి!"

"ఓ.కె. అన్న సూర్యం మరయితే తొందరగా భోజనం వడ్డించెయ్!" కూర్చున్న చోటు నుండి లేస్తూ చెప్పాడు.

"బాగుంది. వంట కాలా! మధ్యలో పిలిచారు"- అంటూ కూర్చున్నదల్లా లేచి "లేడికి లేచిందే పరుగు అన్నట్టుంది మీ హడావుడిని చూస్తుంటే."

"కాదటోయ్! పిల్ల పెళ్ళంటే ఏమనుకున్నావ్?" నవ్వాడు తెల్లగా.

"మీ పనులు ముగించుకోండి" అనేసి అక్కడ నుండి వసంత వంటింటి వైపు వెళ్ళిపోయింది.

"పిల్లా!"

"ఏంటి డాడీ! మళ్ళీ!"

గదిలోంచి వరండాలోకి వచ్చిన సూర్యం "చూడు ఆ డాడీ! పదాన్ని మానమని చెప్పానా!"

"ఏమయిందిప్పుడు?"

"మన సంస్కృతిని కాపాడుకోవాలమ్మా!"

"అలాగే! ఎందుకు పిలిచావు!"

"నీకు కావలసినవి ఏమైనా తేవాలా!?"

"మీరు తేవడానికేమీ లేవుగాని, నేనూ, మా ఫ్రెండ్ మానేపల్లి వెళ్ళి తెచ్చుకుంటాం!" ముచ్చటగా అంది. పేపర్లోకి తలదూరుస్తూ.

"సరె!" అంటూ ఆ విషయానికి స్వస్థి పలికాడు సూర్యం.

○ ○ ○

సూర్యం ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొడుకు హైదరాబాద్‌లో ఉద్యోగంలో స్థిరపడ్డాడు. కూతురు కామ్య డిగ్రీ చేసింది. కంప్యూటర్ కోర్సు అయింది. ఈ మధ్యనే స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు వెడుతోంది.

తండ్రి తనకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారన్న ప్పటి నుండీ మనసులో ఆందోళన ప్రారంభ మయింది.

అన్నయ్య హైదరాబాద్‌లో వున్నాడు గనుక తనకు ఉన్న ఊరికి దగ్గర్లో సంబంధం చూస్తే, కళ్ళెదుట వుం టుంది కూతురన్న ఆశ వాళ్లది.

వచ్చిన సంబంధాలన్నీ కొబ్బరి తోటల్లో దాపుడు గుమస్తాలుగా చేస్తున్న వాళ్లవే. తన తాతగారూ అదే గుమస్తా చేసేవారు. ఆయన శ్రమను చూసిన తను, అనుకుంది అలాంటి సంబంధం చేసుకోరాదని. తను చదువుకుంది. వస్తున్న సంబంధాలన్నీ అంతంత మాత్రం చదువుతో తోటలకీ- దొడ్లకి, సొంత ఇళ్ళకు అంకితమై, బ్రతుకు సాగిస్తున్నవాళ్ళే. తను చదువు కున్నందుకు ఏమిటి ప్రయోజనం. ఈ మారుమూల!? అందుకనే తనో నిర్ణయానికొచ్చింది. ఉద్యోగం చేస్తున్న వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలి. అది ప్రైవేటుగాని, గవర్న మెంటుగాని అన్నది ముఖ్యం కాదు. ఎంత దూరమైనా సరే. సమాజంలో గౌరవంగా జీవించడం ముఖ్యం. అవసరమైతే తనూ ఉద్యోగం చేసి ఒకరికి ఒకరు సహకారంగా జీవించడమే తన మనోభీష్టం.

ఆ విషయాన్ని దాపరికం లేకుండగా అమ్మ-నాన్నలకి చెప్పింది.

కూతురు అభిప్రాయం మంచిదే అని తోచినా, తను అంత పై సంబంధాలకు పోయి తూగలేక అవమా నం పాలు కావడం ఇష్టంలేదని సున్నితంగా చెప్పాడు సూర్యం కూతురుకి.

వసంత కూతుర్ని సమర్థించిందా దశలో.

సూర్యం ఇంక కాదనలేకపోయాడు. తన ప్రయత్నా లను విరమించుకున్నాడు.

అనూహ్యమైన పరిస్థితుల్లో ఈ సంబంధం మధ్య వర్తి ద్వారా వచ్చింది. ఒకటి రెండు దఫాలు, శుభకా ర్యాల్లో పిల్లను చూసిన వాళ్ళు, మధ్యవర్తి ద్వారా పిల్లను గురించి వాకబు చేసినట్టుగా వినవచ్చింది. దాన్ని భరో సాగా తీసుకుని అడుగు ముందుకు వేసి ఒక మంచి రోజున మధ్యవర్తిని వెంటపెట్టుకుని ఫోటోలు ఇచ్చి వచ్చాడు. వాళ్ళ కుటుంబం మంచి చెడ్డలు- భోగట్టా తీసుకున్నాడు. కుటుంబం మంచిది. స్వంత ఇల్లు-కుర్రాడి తండ్రి రిటైరయి వ్యవసాయం చూసుకుంటు న్నాడు. అత్తగారు సౌమ్యురాలు. అన్నీ బాగానే వున్నాయి. తనవూరికి దగ్గర్లోనే ఆ వూరున్నూ. అయితే సూర్య మనసుకి కుర్రాడు ఎక్కడో ఇతర రాష్ట్రమైన మహారాష్ట్రలో ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేయడం బాధనిపించింది. ఆ విషయాన్ని కూతురికి నచ్చచెప్పా లని ప్రయత్నించాడు.

"డాడీ! ఇతర దేశాలకే తరలి వెళ్ళిపోతున్న ఆడ పిల్లలెందరు లేరు. మొన్ననామధ్య నా ఫ్రెండ్ వంటరిగా కెనడా జాబు నిమిత్తం వెళ్ళింది మర్చిపోయారా. మరో రాష్ట్రమయినంత మాత్రానే ఇంత భయపడిపోవాలా" అంటూ తనను తాను సమర్థించుకుంటూ అంది.

మహారాష్ట్ర జలదిగ్బంధంలో వున్న సన్నివేశాలను టివి ఛానల్సులో చూసిన సూర్యానికి, మనసు ఆందోళ నకు గురయింది. కాని కూతురికి అక్కడ ఉద్యోగం చేస్తున్న కుర్రాడితోనే సంబంధం వచ్చింది. ఆ మాట కొస్తే కోనసీమ మట్టుకు గోదావరి మునకకు గురికాదే మిటి. ఓ ప్రక్క ఉన్న ఊరికి దగ్గరలోనే 'గ్యాస్' బ్లోఔట్లతో గుండెలు చేత్తో పట్టుకు బతకలేదా ఏమిటి. అంత మాత్రాన వచ్చిన చక్కని సంబంధాన్ని వద్దనుకుం టామా? అన్న భార్య మాటను కాదనలేకపోయాడు సూర్యం. 'అయినా అన్నీ కలసి రావాలిగా' అనుకు న్నాడు మనసులోనే.

❍ ❍ ❍

మే నెల ఎండ తీక్షణంగా వుంది.

కోనసీమ కొబ్బరితోటలు- అరటి తోటలు- ఒక ప్రక్కగా గోదావరి ప్రవాహం. ఎండ వేడిని, కొంత వరకూ అదుపులోనే ఉంచుతోంది.

మధ్యాహ్నం రెండు గంటలయే సరికి సూర్యం ఇంటి ముందు కారు ఆగింది.

సూర్యం-వసంత కారు దిగిన వాళ్ళని సాదరంగా ఆహ్వానించారు.

మధ్యవర్తి ప్రకాశం వాళ్లను వెంటపెట్టుకుని, ఇంట్లోకి తీసుకువచ్చి కూర్చోపెట్టాడు.

సూర్యం ఇల్లు తండ్రి హయాములో కట్టించింది. అంత పెద్దది కాకపోయినా మరీ చిన్నది మాత్రం కాదు.

ప్రకాశం ఒకరికొకర్ని పరిచయం చేశాడు.

ప్రకాశం భార్య కమల అందరికీ కొత్త తాటి ఆకుల విశనకఱ్ఱలను అందించి నవ్వుతూ "కరెంటు కోత కదా!" అంది.

"మేమూ ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నాము" అన్నారు పెళ్ళి కొడుకు తండ్రి రాజారావుగారు కరంటు కష్టాలను గుర్తుచేసుకుంటూ.

అందరూ గలగలా నవ్వారు.

వసంత అటూ, ఇటూ తిరుగుతూనే కుర్రాణ్ణి పరికిస్తోంది.

'అందగాడే!' అనుకుంటూ ఓ మాటు అనుకుని తన పనిలో నిమగ్నమయిపోయింది.

సూర్యం కొలీగ్ శర్మ కూడా రావడంతో ధైర్యం పుంజుకుంది.

వసంత చల్లని మజ్జిగ దాహం అందించింది అందరికి.

ముహూర్త సమయం కావడంతో "అమ్మాయిని తీసుకురండి" చెప్పాడు ప్రకాశం.

కామ్యను వెంటపెట్టుకుని దొడ్డమ్మ ప్రభావతి వచ్చి కూర్చోపెట్టి ప్రక్కగా తనూ కూర్చుంది.

రెండు మూడు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"ఈయన నీకు కాబోయే మామగారు రాజారావు గారు. ఆవిడ మీ అత్తగారు హైమవతిగారు. నేను కుర్రాడికి పెదతండ్రిని. నన్ను రామారావు అంటారు. ఆ అమ్మాయి మా అమ్మాయి శకుంతల" అన్న రామారావు గారు కామ్య వంక చూస్తూ "చూస్తున్నావా!?" అడిగారు.

కామ్య చిన్నగా నవ్వుతూ తల ఊపింది.

"ఇక అబ్బాయి రాజేశ్వర్" అన్న రామారావు గారు "ఫోటో చూసే వుంటావు. ఇప్పుడు స్వయంగా కళ్ళెదుట వున్నాడు చూడు" అన్నారు నవ్వుతూ.

అందరూ ఆయన నవ్వులో నవ్వులు కలిపారు.

"ఏం చదువుకున్నావు?" హైమవతి అడిగింది.

"బి.కాం" చెప్పింది కామ్య.

"పేరేమిటి?"

"కామ్య" మృదువుగా చెప్పింది.

"గ్యాస్ అయిపోతే కట్టెలతో వంట చేయగలవా?"

కామ్య ఆవిడ ప్రశ్నకు ఆశ్చర్యపోయింది.

కొబ్బరి మట్టలు- కొబ్బరి డొక్కలే కదా మనకున్న వంట చెరకు అందావిడ మళ్ళీ.

కామ్య తల అడ్డంగా ఊపింది.

వసంత అది గమనించి, అదోలా అయింది. అంతలోనే 'అయినా కూతురు అత్తవారింట్లో వుండబోదుగా- భర్తతో మహరాష్ట్రలో వుంటుంది గానీ! అర్థంలేని ఈ ప్రశ్నేమిటి?' అనుకుంది.

"పాట పాడితే వినాలనుంది. పాడుతావా!" శకుంతల కుతూహలంగా అడింది.

కామ్య తల్లి వంక చూసింది.

అంతకు ముందు రోజు వసంత "వాళ్ళు వచ్చినప్పుడు పాట పాడమని అడగవచ్చు సుమా! జంకు లేకుండా చక్కగా పాడాలి" అంది.

"సంగీతం నేర్పించామంటూ వాళ్ళ ముందు చెప్పి పాట పాడు- డ్యాన్స్ చెయ్యి అనకు" సున్నితంగా వార్నింగ్ ఇచ్చినందున స్థబ్దతగా వుండిపోయింది వసంత.

ప్రభావతి సన్నగా నవ్వుతూ "పాడమ్మా!" అంది కామ్య భుజం తట్టి.

దొడ్డమ్మ మాటను కాదనలేకపోయింది కామ్య.

అందరూ కామ్యవంకే ఆసక్తిగా చూస్తుండిపోయారు.

కామ్య ఒకమారు తల్లి వంక చూసి గళం విప్పింది.

"రారా! వేణు, గోప బాలా! రాజిత సద్గుణశీల..."

శ్రావ్యంగా పాటను ముగించింది కామ్య.

"అమ్మా కామ్యా! పాటను చాల చక్కగా పాడావు. ఆ పాటను తర్వాత కాగితం మీద రాసి నాకు ఇస్తే నేను దాని భావం నీకు చెప్తాను" అన్నారు శర్మగారు వ్యంగ్యంగా.

రెండు క్షణాలు అంతా నిశ్శబ్దం- ఆ తర్వాత కిలకిల నవ్వులు.

రాజేశ్వర్ మట్టుకు గంభీరంగా వుండిపోయాడు.

అలా ఆయన ఎందుకన్నది- అందరూ అంతలా ఎందుకు నవ్వింది కొన్ని క్షణాల వరకు గ్రహించలేని

## ఋతుహేల

ఆశలు
ఎండుటాకుల్లా
శిశిరాన్ని స్మరిస్తూ
పరిసరమంతా
హిమవంతపు సీమంతం
హేమంతాన్ని గుర్తుచేస్తూ
వగరుస్తూ ఉక్కదీస్తూ
దినకరుడు...
వేసవిని చవి చూపిస్తూ
కోరికలు
హరితాశ్వాలనధిరోహిస్తూ
వసంతాన్ని స్వాగతించే దిశగా..
పుడమి తల్లికి
పురిటి రోజులు
వానచినుకులకు జన్మగదా...

–రావెల పురుషోత్తమరావు

కామ్య మెల్లగా పాట భావాన్ని అర్థం చేసుకుని బిడియంతో ముడుచుకుపోయింది, ఓరకంట రాజేశ్వర్‌ని చూసింది. అతను ఏమనుకుంటాడోననుకుంటూ-

అతను ప్రశాంతంగా వున్నాడు.

కామ్య మనసు కుదుట పడింది.

శర్మ- కృష్ణారావులు పెళ్ళివారికి మర్యాదలు చేస్తుండగా, సూర్యం

"అన్నయ్యగారూ మీరు కూర్చోండి మేమున్నాంగా" అంటూ కృష్ణారావు చేతుల్లో వున్న స్వీట్స్ ప్లేట్లు అందుకున్నాడు.

"ఇంకేమైనా అడుగుతారా?" ప్రకాశం అన్నాడు. మధ్యవర్తి హోదాలో.

రాజేశ్వర్‌ని చూసింది హైమవతి.

రాజేశ్వర్, ఒక్క నిమిషం పాటు కామ్య వంక చూసి "ఉద్యోగం చేయడం ఇష్టమేనా?" అడిగాడు సూటిగా.

కామ్య మౌనంగా తల వూపింది ఇష్టమేనన్నట్టు.

"ఇంకేం నీ అభీష్టం తీరుతుందోయ్" అన్నాడు ప్రకాశం.

"ఏమనుకున్నారేమిటి. ఈనాటి ఆడపిల్ల" అన్న

## ఆకలితో అంతిమయాత్ర

**కాలే** డొక్కను
మెడకు తగిలించుకుని
ఎండిన గొంతును తడపడం కోసం
ఎన్ని వేదనలో నాలో!
జీవన పోరాటాన్ని / ఉరికొయ్య మీద వేలాడదీసి
ఒక చెక్క బొమ్మగా మారడానికి
మరణం ఒప్పుకోవడం లేదు
మట్టి నన్ను ప్రార్థిస్తూ వుంది!
ఆశల ప్రతిబింబాలు
ఆత్మహత్య చేసుకుంటున్న
భీతావహ పరిణామం
నన్ను నిద్రపోనివ్వదు.
బ్రతుకు ఉనికి ప్రశ్నార్థకమైనపుడు
నివేదనతో రెండు చేతుల్ని
కాలం పాదాలకు మొక్కినా
నా వారసత్వ జీవిత శైలిని
చూస్తానన్న నమ్మకం
నాలో దహనమైపోయింది.

-మండాది గోపీనాథ్

రామారావుగారు "అభిరుచులు, అభిప్రాయాలు అన్నీ వేరు" అన్నారు నవ్వుతూ.

"నువ్వు ఏమైనా అడుగుతావా?" అంది శకుంతల చనువుగా.

అందరూ కామ్య వంక ఆసక్తిగా చూశారు.

కామ్య క్షణం తర్వాత అంది మెల్లగా, "నాకు డ్రెస్ లంటే ఇష్టం. అవి వేసుకోవచ్చా?" కానున్న అత్తగారి వంక కొద్దిగా తలెత్తి చూసి అడిగింది.

శుభకార్యాల్లో అందరం కలసినప్పుడు లక్షణంగా చీర కట్టుకో, మిగిలినప్పుడు నీ యిష్టం. అయినా ఈ రోజుల్లో అందరూ డ్రెస్సులేగా వేసుకుంటున్నది. అందునా నువ్వు ఉండబోయింది కూడా మహారాష్ట్రలో. అభ్యంతరం ఏముంటుంది" అంది హైమవతి.

"అమ్మాయిని లోపలకు తీసుకువెళ్ళండి" అన్నారు రామారావుగారు.

ప్రభావతి కామ్యను లోపలకు తీసుకువెళ్ళింది.

"మిగిలిన విషయాలు..." శర్మ సూర్యం తరపున రాజారావు గార్ని చూసి అన్నాడు.

"మిగిలిన విషయాలంటే మరేమీ లేవు. ముఖ్యంగా అబ్బాయికి కట్న కానుకలు తీసుకోవటమంటే సుత రాము ఇష్టంలేదు. తండ్రిగా నా అభిప్రాయం కూడా అదే. ఇక ఉద్యోగమంటారా, అది ఆ యిద్దరి అభిరుచిని పట్టి జరిగేది. మా వూళ్ళో ఉండేదైతే ఆడపిల్లను ఉద్యోగం చేయించేది లేదు. కాని కాపురం మహారాష్ట్ర స్టేట్‌లో, అదీగాక వంటరి కాపురం, కాలాన్ని బట్టి భార్యా భర్తలిద్దరూ చదువుకున్న వాళ్ళే గనుక, ఆడపిల్ల ఉద్యోగం చేయడంలో తప్పేమీ అనిపించదు. ఒక రకంగా స్త్రీ స్వాతంత్ర్యం- ఆర్థిక స్వావలంబన ఉంటాయి. మరి మీ అభిప్రాయం ఎలా వుంటుందో!?" అర్థోక్తిలో అన్నారు రామారావు గారు.

"పిల్ల మీదయినప్పుడు మా అభిప్రాయం ఏముంటుంది?" శర్మ నవ్వుతూనే అన్నాడు.

"అబ్బాయి ఆఫీసుకు వెళ్ళిపోతే, ఒక్కర్తీ ఇంట్లో కూర్చుని పొద్దుకూకులు ఏం చేస్తుంది గనుకను" అన్న మధ్యవర్తి ప్రకాశం "చదువుకున్న దానికి సార్థకతంటూ ఉంటుంది కూడాను" అన్నాడు.

"మా రోజుల్లోనైతే ఇంటెడు పని చేసుకోవలసి వచ్చేది, రెక్కలు ముక్కలయేలా, ఇప్పుడంతా ఈజీనేగా, కరంటు పుణ్యమాని" హైమవతి గలగల నవ్వుతూ అంది.

"సరే బావగారూ! ఇంటికి వెళ్ళి ఫార్మాలిటీగా ఫోన్

చేస్తాం" నిలబడిన చోటు నుండి కదులుతూ అన్నారు రాజారావు గారు.

"అలాగే!" అన్న సూర్యం "మరి ఫోన్ కోసం ఎదురు చూస్తుంటాం" అన్నాడు రాజారావు గార్ని అనుసరిస్తూ.

అప్పటికే శకుంతల, రాజేశ్వర్‌లు కార్లో కూర్చున్నారు.

రామారావు గారు కారు వద్ద నిలబడి చూస్తున్నారు పరిసరాలను.

ప్రకాశరావుని, కమలని ఆగిపొమ్మని చెప్పింది వసంత.

కారు వరకూ వెళ్ళి అందరికి వీడ్కోలు చెప్పారు సూర్యం, వసంతలు.

శర్మ రెండడుగులు వేసి నిలబడ్డాడు.

కారు కదిలింది మెల్లగా.

ㅇ ㅇ ㅇ

కారు అటు వెళ్ళగానే సూర్యం, శర్మ, వసంత, కమల వరండాలోంచి హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

"అబ్బాయి పిల్లతో ఉద్యోగం చేయిస్తానంటున్నాడు..." అర్థోక్తిలో అంది భర్త వంక, శర్మ వంకా చూసి.

"అవును" సాలోచనగా అన్నాడు సూర్యం.

"వాళ్ళు కట్నం వద్దన్నారని సంబరపడుతున్నామే గాని.. రేపు పిల్లని ఉద్యోగం పేరిట, రాచి రంపాన పెట్టి, దానికి నిముషం తీరిక లేకుండా, జీవితాంతం సుఖపడకుండా చేయడు కదా!?" భీతిగా అంది వసంత.

"అదేం మాట, ఇంతవరకూ మన పిల్లమ్మా! ఇకపై వాళ్ళ పిల్ల" అన్నాడు శర్మ.

"కుర్రాడు అలాంటి మనస్థత్వం వున్నవాడు కాదు. ఆ విషయం నాకు పూర్తిగా తెలుసు. చిన్నప్పటి నుండి ఇక్కడే కళ్ళ ముందు సంచరించినవాడు. ఇప్పుడంటే ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రంలో ఉంటున్నాడంతే" ప్రకాశం భరోసాగా అన్నాడు.

"కుటుంబం కూడా చాలా మంచిది అక్కా. అత్తగారు ప్రేమగా చూస్తుంది" తనవంతు విషయాన్ని తెలిపింది ప్రకాశం భార్య కమల.

అందుకు కారణం అదే వూళ్ళో వుండటమే.

"అతను మాత్రం భార్యను, డబ్బు సంపాదించే మనిషిగా చూడడు. చేదోడు వాదోడుగానూ, కాలక్షేపంగాను, సంఘంలో హుందాగానూ ఉంటుందని మాత్ర

## ప్రచారాంధ్రం

నగ్నాంతరీక్ష నక్షత్ర కాంతులై
నవ్యాంధ్ర కక్ష్యలో సాంకేతికాంశులై
ఇజ్జగమందున త్రిశంకు స్వర్గపు
ద్వారం తెరిచిన వార్తాహరులై-
వాడవాడలా నీడలు పరచే
వేడివాడిగా వెన్నులు చరిచే
నన్నయ నాడున శారద వీడున
శ్రీశ్రీ చలాల జాడల జాలుల
బాపురేఖల వపాల వలువల
విలువల నెరిగిన విజ్ఞుల విలాస
వనమాలికలకు వందన శతాలు,
'కా.నా.వే.'లకు వేవేల ముఖాలు
సజీవపత్ర ప్రచారాముఖులు;
ఉదయ సంధ్యలలోన ఉత్థాన జ్యోతులా
ఉలుకు పలుకుల జవసత్వాల హోరు
నవ్యనాదోపాఖ్యానాల కలికు కైజారు
మాడు మొత్తెడి తెలుగు పత్రికల జోరు.
ఏ దేశమందునా ఏ శ్వాస చిందునా
ఏ భాష పొందునా నెత్తావి తెలుగు
విశాల సాహితి ప్రశాంత కాహళి
వినువీధి మూసలో విశ్వ ప్రహేళి
శాంతి సంఘర్షణాకర్ష వీక్షణల
మాట మల్లెలు విరిసె మహితార్థమై
కళలు కావ్యాలుగా బహుళార్థమై
ఎందరని గుర్తించ తామైన గుడుల దేవుళ్ళు
కొందరిని గమనించ ఆంధ్ర బడుల జీవుళ్ళు;
ఆంధ్ర మస్తక మహా సమస్త మేథ
భువన ఘోషల తళుకొత్తు శోభ
సాహిత్య వారధుల పాట పల్లకిలెత్తి
కవితా నిబద్ధమై కంఠసిరి శబ్దమై
అరుపచ్చులందాల ఆంధ్ర దరహాసం
అరుదైన మనుచిత్ర ప్రతిభా ప్రకాశం;
మానవలోకం మహిచ్ఛందాలను
ప్రపంచపటలపు పదబంధములుగ
అంగాంగరంగముల జీవసమిథలా
అలంకృతంబగు తెలుగు చిత్రమున
తీయని స్వనముల తృప్తి విశేషం
పద్య గద్యముల బీజ ప్రాభవం
ప్రచార క్షేత్రపు పూర్వ వైభవం

('కా.నా.వే.' = కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, నార్ల వేంకటేశ్వరరావు)

-కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు

మే అతని అభిప్రాయం" అన్నాడు ప్రకాశం.

"అవుననుకోండి! ఏమైనా మన కుటుంబంలో లేనిది కదా..." అప్పుడే 'టీ' కప్పు చేత్తో పట్టుకుని లోపలి నుండి వచ్చిన కామ్యను చూశాడు ప్రకాశం.

కామ్య చిన్నగా నవ్వింది.

"ఉద్యోగం చేస్తాననేశావ్!" ప్రకాశం లౌక్యంగా అన్నాడు.

"ఆ! భయం దేనికి.." అంది కామ్య నవ్వి.

ఆఁ! నవ్వుగానే వుంటుంది. రేపు అక్కడ, ఉద్యోగంలో చేరింతర్వాత గాని బాధ తెలీదు" వసంత నిష్టురంగా అంది కూతుర్ని చూసి.

"ఇది మీ కాలం కాదమ్మా! ఇంట్లో ఒక్కళ్ళు సంపాదిస్తుంటే నల్గురు అతని సంపాదన మీద ఆధారపడి బ్రతకడానికి. ప్రస్తుత కాలంలో ఆడ-మగ అన్న తేడా లేకుండా కష్టపడితేనే జీవితం సాఫీగా సాగేది. ఈ తరం ఆడపిల్ల వాక్ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం- జీవితంలో స్వేచ్ఛా కోరుకుంటోంది. అందుకే ఉన్నత చదువులు చదువుకుంటోంది. పూర్వంలా ఎక్కడ వాళ్ళు అక్కడే కూపస్థ మండూకాల్లా బ్రతకడం సాధ్యం కాదమ్మా!" సూటిగా చెప్పింది కామ్య.

"ఇవన్నీ కాలేజీ డిబేట్సులో చెప్పడానికి గాని, నిజ జీవితంలో సాగవమ్మా!" సాగదీసింది వసంత ఉక్రోషంగా.

"ఎందుకు సాగవు. మనిషి సాగించుకోవాలన్న తపన వుంటేను" పట్టుదలేమిటో చూడమన్నట్టుగా చెప్పింది కామ్య.

కూతురలా అంటుంటే, వసంతకు ఎక్కడలేని ఉడుకుమోత్తనం వచ్చేసింది. "అలాగే అంటావ్! నీకేం. ఇక్కడ మా మనసులెంతగా కొట్టుకుపోతాయో తెలుసా!" గొంతు జీరబోతుండగా అంది.

"ఏం కొట్టుకుపోనక్కర్లేదు. జాబ్ చేస్తానన్నాను. చేస్తాను- చూస్తావుగా నీ కూతురు పట్టుదల" అంది కామ్య చేతిలో వున్న 'టీ' కప్పును అమ్మకి అందిస్తూ.

"ఇదిగో కనిపిస్తూనే వుంది. ఎంత కష్టపడిపోతావో! 'టీ' కప్పును అమ్మచేతికందించే సుకుమారివి" వ్యంగ్యంగా నవ్వింది వసంత.

సూర్యం తల్లీ కూతుళ్ళ వాదనను వింటూ, శర్మను, ప్రకాశాన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఏంటా చూపులు. పిల్ల ఎలాగంటే అలా తలాడించటమేనా?" ఉక్రోషం తారస్థాయికి చేరుతుండగా, చిరుకోపంతో అంది వసంత.

"కామాక్షి అని ఎంతో అభిమానంతో పిల్లకి మా అమ్మ పేరు పెడితే, అది హైస్కూల్లో ప్రవేశించే ముందు, కామ్యగా మార్చి రిజిష్టర్ చేయమని పట్టుపట్టి, కామ్యగానే చేరింది. అప్పుడే, దాని పట్టుదల ఎటు వంటిదో పసిగట్టానోయ్!" గంభీరంగా చెప్పాడు కూతురు గురించి అన్యాపదేశంగా సూర్యం.

బాగానే ఉంది సంబరం.

అప్పుడే ఫోన్ మోగింది.

సూర్యం లేచి వెళ్ళి అందుకున్నాడు.

హాల్లో కూర్చున్న వాళ్ళు లేవడానికి సంసిద్ధమవుతుంటే "ఉండండి, ఆ ఫోన్ ఎక్కడినుండో తెలుస్తుందిగా" అంది వసంత.

సూర్య ప్రసన్న వదనంతో హాల్లో అడుగుపెట్టగానే, అందరూ ఆత్రంగా అతన్ని చూశారు.

"పిల్ల మామగారే చేశారు."

"ఏమిటట?"

"వాళ్ళు వెడుతూనే ఒక నిర్ణయానికి వచ్చారట. అబ్బాయి వెంటనే వెళ్ళిపోవాలట. అందుకని ఈ మాఘ మాసంలోనే ముహూర్తం పెట్టించుదామని" విషయాన్ని క్లుప్తంగా చెప్పాడు.

"అప్పుడే ఇంటికి చేరడం, ఫోన్ చెయ్యడం. వాళ్ళూ స్పీడుగానే వున్నారు" శర్మ అన్నాడు.

"అవును. వాళ్ళకి అబ్బాయి పెళ్ళి తొందరగా చేయాలనే అభిప్రాయం వుంది" మధ్యవర్తి ప్రకాశం గంభీరంగా చెప్పాడు.

"ఇంకేం, శుభం" అంది కమల, ముఖమంతా నోరు చేసుకుని.

"ఇంక వెళ్ళివస్తాం" లేచాడు ప్రకాశం.

శర్మని, ప్రకాశం- కమలను ఆటోల్లో వెళ్ళమని అన్నాడు సూర్యం. వసంత వాళ్ళకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

❍ ❍ ❍

కామ్య పెళ్ళి కాగానే భర్తతో మహారాష్ట్రకు వెళ్ళిపోయింది.

నెల రోజుల తర్వాత, అక్కడ భర్త పనిచేస్తున్న కంపెనీలోనే జాబ్‌లో చేరుతున్నట్టుగా ఇంటికి ఫోన్ చేసింది.

సూర్యం, వసంతలు కూతురు చేసిన ఫోన్‌తో అనూహ్యమైన ఆనందాన్ని పొందారు.

ఈ తరం ఆడపిల్ల అనిపించింది పిల్ల అన్నాడు సూర్యం భార్య వసంతను చూస్తూ సగర్వంగా. ■